సాక్షి
నల్లగొండ
శనివారం ׀ 10 ׀ ఫిబ్రవరి ׀ 2024





**దొంగల ముఠా అరెస్ట్**
చోరీలకు పాల్పడుతున్న పది మంది దొంగల ముఠాను కొండమల్లేపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



**ఖోఖో పోటీలు ప్రారంభం**
రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో పోటీలు శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యాయి. - 10లో



**విష ప్రయోగంతో హత్య**
వీరబోయనపల్లికి చెందిన నంది సహదేవుడు(42)ను విష ప్రయోగంతోనే హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. - 8లో

## న్యూస్‌రీల్

### ఆయుర్వేద వైద్యం.. అద్భుతం



సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావుకు స్వాగతం పలుకుతున్న పండిట్ శ్రీనివాస్

మిర్యాలగూడ: పట్టణంలోని బోధిధర్మ వైద్యశాలలో అందిస్తున్న ఆయుర్వేద వైద్యసేవలు అద్భుతమని సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావు కొనియాడారు. పక్షవాతానికి గురైన తన బంధువును చికిత్స కోసం శుక్రవారం బోధిధర్మ వైద్యశాలకు తీసుకొచ్చిన కలెక్టర్ వైద్యశాలలో రోగులకు అందిస్తున్న వైద్యం తీరు, సమీపంలోని గోశాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వనమూలికలతో దీర్ఘకాలిక రోగాలను కూడా నయం చేస్తున్న పండిట్ శ్రీనివాస్ గురూజీని అభినందించారు. ఆయుర్వేద వైద్యం గురించి తెలియడంతో తన బంధువుని వైద్యం కోసం ఇక్కడికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట వనం మదన్ మోహన్, నాగిరెడ్డి ఉన్నారు.

### అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నార్కట్‌పల్లి: ఈ విద్యా సంవత్సరం చివరి నాటికి ప్రతి విద్యార్థిలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి అన్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశాలను పరిశీలించి మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలను విధిగా నిర్వహించాలన్నారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కె.నర్సింహ, నార్కట్‌పల్లి, అక్కినపల్లి, ఎల్లారెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌ల హెచ్ఎంలు డి.రాములు, ఎస్.వెంకటేశం, బి.హిమజల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్



నల్లగొండలో ప్రాక్టికల్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఐఈఓ తదితరులు

నల్లగొండ: జిల్లాలోని పలు కేంద్రాల్లో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం జరిగిన జనరల్, ఒకేషనల్ పరీక్షలకు 1,122 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,082 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు. సాయంత్రం జరిగిన ప్రాక్టికల్ పరీక్షకు 849 మందికి 826 మంది హాజరు కాగా, 23 మంది పరీక్ష రాయలేదు. ఈ సందర్భంగా డీఐఈఓ దస్రునాయక్ నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

### పథకాలను గ్రామాల్లో ప్రచారం చేయాలి



ఉరుమడ్లలో కరపత్రాలతో ప్రచారం చేస్తున్న వర్షిత్‌రెడ్డి తదితరులు

చిట్యాల: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చిట్యాల మండలం ఉరుమడ్ల, గుండ్రాంపల్లి గ్రామాల్లో శుక్రవారం చేపట్టిన బీజేపీ పల్లెకు పోదాం పదండి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ ఓబీసీ జాతీయకార్యవర్గ సభ్యుడు కడకంచి రమేష్, ఆ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, ఎస్సీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ లింగస్వామి, నాయకులు నర్సింహ, నరేష్, పాపని, వజన, వాసుదేవ్, పరమేష్, నరేష్, కల్లెం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిధుల వరద వస్తుందా!

## నేడు రాష్ట్ర బడ్జెట్.. ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఆశలు

- పెండింగ్ పనులకు కేటాయింపులు ఏమేరకు ఉంటాయో..
- ఎస్ఎల్‌బీసీ, ఏఎమ్మార్పీకి, బ్రాహ్మణవెల్లెంలకు గతంలో అరకొరగానే నిధులు
- బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన లిఫ్ట్‌లు అక్కడే..



**కొత్త ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టులకు నిధుల వరద పారుతుందని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశ పెట్టుకున్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో పెండింగ్ ప్రాజెక్టులకు ఎంత మేరకు నిధులను కేటాయిస్తుందోనని ఎదురుచూస్తున్నారు.**

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎస్ఎల్‌బీసీ సొరంగం, ఏఎమ్మార్పీ కాలువల విస్తరణతోపాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పెండింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కీలక ప్రాజెక్టులకు పెద్దగా నిధులను కేటాయించలేదు. బ్రాహ్మణవెల్లెంల వంటి ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు ఇవ్వలేదు. డిండి ప్రాజెక్టుకు నీటిని ఎక్కడి నుంచి ఇస్తారన్న విషయాన్ని తేల్చలేదు. పాలమూరు–రంగారెడ్డిలో అంతర్భాగంగా చేపట్టిన డిండి ఎత్తిపోతల పథకం కింద నిర్మిస్తున్న సింగరాజుపల్లి, కిష్టరాయినిపల్లి, గొట్టిముక్కుల, చింతపల్లి, చర్లగూడెం రిజర్వాయర్లు పూర్తి కాలేదు. మాజీ సీఎం కేసీఆర్ సాగర్ ఉప ఎన్నిక తరువాత 15 ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేశారు. అందులో ఒకటీ రెండు పథకాల పనులే ప్రారంభం కాకపోగా, మిగతా వాటిల్లో సగం పనులు కూడా కాలేదు.

**కొత్త ప్రభుత్వం రాకతో చిగురించిన ఆశలు**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై ఆశలు చిగురించాయి. నీటి పారుదల శాఖ మంత్రిగా ఉమ్మడి జిల్లాకే చెందిన నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉండగా, ఎస్ఎల్‌బీసీ టన్నెల్, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులను అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని ఒప్పించి, మంజూరు చేయించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్నారు. ప్రాజెక్టుల ప్రారంభంలో పనులు వేగంగా కొనసాగాయి. వైఎస్ మరణాంతరం ప్రాజెక్టులకు పెద్దగా నిధులు మంజూరు కాలేదు. అరకొర నిధులతో సొరంగ మార్గం ఒక్క అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా సాగింది. కొన్ని సందర్భాల్లో బడ్జెట్‌లో కేటాయించిన నిధులు కరెంట్ బిల్లులకు కూడా సరిపోలేదు. బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టుకు కూడా నిధులు కేటాయించకపోవడంతో చివరి దశలో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తి చేయించడంతో పాటు ఏఎమ్మార్పీ కాల్వల లైనింగ్‌కు నిధులను మంజూరు చేయించి, పనులను ప్రారంభిస్తామని ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. వాస్తవానికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను వంద శాతం పూర్తి చేసేందుకు రూ.5వేల కోట్లు అవసరం. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ, హుజూర్‌నగర్, నల్లగొండ నియోజకవర్గాల్లో మంజూరు చేసిన నెల్లికల్, అయిటిపాముల సహా 15 ఎత్తిపోతలకు దాదాపు రూ.3,346 కోట్లు అవసరం. ఈ నేపథ్యంలో ఈ బడ్జెట్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతమేరకు నిధులను కేటాయిస్తుందన్నది నేటి బడ్జెట్‌లో తేలనుంది.

**యూనివర్సిటీకి రూ.40 కోట్లు కావాలి**
మహాత్మాగాంధీ యూనివర్సిటీలోని గర్ల్స్ హాస్టల్, ఓవర్ హెడ్ ట్యాంకులు, స్పోర్ట్స్ గ్రౌండ్ అభివృద్ధి, అడ్మినిస్ట్రేషన్ భవన నిర్మాణం తదితర పనుల కోసం రూ.40 కోట్లు కావాలని యూనివర్సిటీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అందులో ప్రభుత్వం ఎంతమేర నిధులు కేటాయిస్తుందో చూడాలి.

**బస్వాపురం రిజర్వాయర్‌కు ఇంకా రూ.250 కోట్లు అవసరం**
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భువనగిరి మండలంలో నిర్మిస్తున్న బస్వాపూర్ రిజర్వాయర్ పనులు నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టుకు ఇంకా రూ.250 కోట్లు అవసరం. ప్రధాన కాలువలు పూర్తి కాలేదు. ముంపు బాధితులు, కాలువల్లో భూములు కోల్పోతున్న వారికి నాలుగేళ్లయినా పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. ఇక గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంపై స్పష్టతే లేదు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా ఆలేరు, భువనగిరి, నకిరేకల్, మునుగోడు, నియోజకవర్గాలకు సాగునీరు అందించాల్సి ఉంది.

**నిధుల లేమితో అటకెక్కిన ఆధునీకరణ**
వృథాగా పోతున్న మూసీ జలాలను సద్వినియోగం చేసుకొని ఆయకట్టును మరింత స్థిరీకరించేందుకు ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి, బునాదిగాని కాలువలను ఆధునీకరించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. 2013లో రూ.320 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు రూపొందించగా టెండర్ల ప్రక్రియ అనంతరం రూ.280 కోట్లకు పరిపాలనా ఆమోదం లభించింది. 2016లో జూన్‌లో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్.. సాగునీటి కాలువల ఆధునీకరణకు నిధులు మంజూరు చేశారు. ధర్మారెడ్డి, పిలాయిపల్లి, బునాదిగాని కాలువ పనులను ఒకే ప్యాకేజీ కింద చేపట్టేందుకు రూ.222 కోట్లతో అగ్రిమెంట్ చేశారు. 2016లో నూతన డిజైన్ ప్రకారం పనులు ప్రారంభించగా నేటికీ పూర్తి కాలేదు. నిధుల కొరత, మరోవైపు భూసేకరణలో జాప్యం వల్ల కాల్వల వెడల్పు, లోతు పెంచే పనులు నిలిచిపోయాయి. వీటితో పాటు ఆలేరు, గుండాల మండలాలకు సాగు నీరిందించే దేవాదుల కాలువల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.



సర్వేల్ గురుకుల విద్యాలయ ప్రధాన ద్వారం

# గురుకుల విద్యకు నాందిపలికిన పీవీ

- సర్వేల్‌లో గురుకుల పాఠశాలను ప్రారంభించిన పీవీ నర్సింహారావు
- దేశంలోనే మొదటి గురుకుల విద్యాలయం ఇక్కడే..
- పీవీకి భారత రత్న దక్కిన నేపథ్యంలో ఆయన సేవలు గుర్తుచేసుకుంటున్న పూర్వ విద్యార్థులు



పాఠశాలలో ఏర్పాటు చేసిన పీవీ విగ్రహం

సంస్థాన్ నారాయణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్‌లోని గురుకుల పాఠశాలను దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 1971లో ప్రారంభించారు. భారత దేశంలోనే మొట్టమొదటి గురుకుల పాఠశాల ఇది. గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ గల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, అత్యున్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గురుకుల విద్యా వ్యవస్థకు నాందిపలికారు. పీవీ నర్సింహారావుకు 'భారత రత్న' వచ్చిన నేపథ్యంలో ఆయన సేవలను ఈ ప్రాంత ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. సర్వేల్ గ్రామానికి చెందిన సర్వోదయ నాయకుడు, గాంధేయవాది మద్ది నారాయణరెడ్డికి పీవీతో సన్నిహిత సంబంధం ఉంది. అ సంబంధంతో స్వతంత్ర భారత దేశంలో మొట్ట మొదటి గురుకుల విద్యాలయం ఇక్కడ ఏర్పాటైంది. గురుకుల పాఠశాలకు మద్ది నారాయణరెడ్డి తన భూమిని విరాళంగా ఇచ్చారు. సర్వేల్ గ్రామ నడిబొడ్డున ఉన్న 44 ఎకరాల స్థలాన్ని, సర్వోదయ ఆశ్రమ భవనాలను నారాయణరెడ్డి గురుకులానికి అప్పగించారు. పీవీ నర్సింహారావు ముఖ్యమంత్రి హోదాలో 1971 నవంబర్ 23న సర్వేల్ గురుకుల విద్యాలయాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ గురుకుల వ్యవస్థకు సర్వేల్ గురుకుల విద్యాలయం నాంది. ఈ విద్యాలయంలో చదివిన అనేక మంది ఉన్నత ఉద్యోగాల్లో, హోదాల్లో స్థిరపడ్డారు.



పీవీ.నర్సింహారావు ప్రారంభించిన గురుకుల విద్యాలయ శిలాఫలకం

**ఐపీఎస్ అధికారి మల్లారెడ్డి తొలి బ్యాచ్ విద్యార్థి**
సర్వేల్‌లో ప్రభుత్వ గురుకుల విద్యాలయం ఏర్పడిన తర్వాత తొలి బ్యాచ్‌లో బి.మల్లారెడ్డి విద్యనభ్యసించారు. ఈయన ఐపీఎస్ అధికారిగా ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కమిషనరేట్లలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ట్రాన్స్‌కో జేఎండీగా (విజిలెన్స్) సేవలు అందిస్తున్నారు.

# ఆశా వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

నల్లగొండ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న డిసెంబర్, జనవరి వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లకు రెండు నెలలుగా వేతనాలను ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఆశావర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు ఏర్పుల యాదయ్య, నాంపల్లి చంద్రమౌళి, పెంజర్ల సైదులు, డి.మహేశ్వరి, తవిటి వెంకటమ్మ, జి.విమల, టి.పార్వతమ్మ, ఆర్.కవిత, కోరె లలిత, ఆర్.శైలు, వసంతం, జె.పద్మ, సలీమా, వజ్రమ్మ, ఎస్.జయమ్మ, డి.శారద, రాధిక, షాహినా తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాకు 50 మంది ఎంపిక

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ క్యాంపస్‌లో శుక్రవారం హెటిరో డ్రగ్స్, కామినేని మెడికల్ సైన్స్ అండ్ హాస్పిటల్స్ నార్కట్‌పల్లి కంపెనీల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించాయి. బీఎస్సీ (కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), బీ ఫార్మసీ, ఎంబీఏ విద్యార్థులు 90మంది పేర్లు నమోదు చేసుకుని హాజరయ్యారు. ఇందులో 50 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ప్లేస్‌మెంట్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రశాంత్ తెలిపారు.

**ఐటీఐ అభ్యర్థులకు 12న జాబ్‌మేళా**
నల్లగొండ: ఐటీఐ కోర్సులోని వివిధ ట్రేడ్‌లలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు వివిధ పరిశ్రమల్లో అప్రెంటీషిప్ శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈనెల 12న ఉదయం 10 గంటలకు నల్లగొండలోని ప్రభుత్వ (ఓల్డు) ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www.apprenticeshipindia.gov.inలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నమోదు కాపీతో పాటు బయోడేటా, సంబంధిత విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

# పలువురు సీఐలు, ఎస్ఐలు బదిలీ



నల్లగొండ క్రైం: జిల్లాలో పలువురు సీఐలు, ఎస్ఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఐజీ కార్యాలయంలో ఉన్న పీఎన్‌డీ.ప్రసాద్‌ను మిర్యాలగూడ వన్‌టౌన్‌కు, నల్లగొండ వీఆర్‌లో ఉన్న ఆర్.గోపిని నల్లగొండ డీటీసీకి, శాలిగౌరారం సీఐ రాఘవరావును హాలియాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నల్లగొండ ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తిని కొండమల్లేపల్లికి, కొండమల్లేపల్లి ఎస్ఐ వీరబాబును పెద్దవూరకు, నేరడుగొమ్ము ఎస్ఐ బి.రాజును డిండికి, డిండి ఎస్ఐ డి.సైదులును దేవరకొండ ఎస్ఐ–2గా, దేవరకొండ ఎస్ఐ–1 సత్తయ్యను నేరడుగొమ్ముకు, నల్లగొండ మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ–1 వి.శేఖర్‌కు మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్ఐ–2గా పోస్టింగ్ ఇచ్చారు. సీసీఎస్ నల్లగొండలో ఉన్న సందీప్‌రెడ్డిని నల్లగొండ–1టౌన్ ఎస్ఐ–2గా, వీఆర్ఎల్‌లో ఉన్న డి.నర్సింహులును గుడిపల్లి ఎస్ఐగా, శాలిగౌరారం ఎస్ఐ సతీష్‌ను నకిరేకల్ ఎస్ఐగా, హాలియా ఎస్ఐ–1 శోభన్‌బాబును దేవరకొండ ఎస్ఐ–1గా, వీఆర్‌లో ఉన్న సతీష్‌రెడ్డిని హాలియా ఎస్ఐ–1గా, వీఆర్‌లో ఉన్న ధర్మాను హాలియా ఎస్ఐ–2గా, దేవరకొండ ఎస్ఐ గోపీకృష్ణను నల్లగొండ మహిళా పోలీస్ స్టేషన్‌ఎస్ఐ–1గా, సీసీఎస్ నల్లగొండలో ఉన్న కె.శ్రీనును కట్టంగూర్‌కు, వీఆర్ నల్లగొండలో ఉన్న కృష్ణమూర్తిని నల్లగొండ ట్రాఫిక్ పీఎస్‌కు, నల్లగొండ సీసీఎస్‌లో ఉన్న నారాయణరెడ్డిని తిరుమలగిరి సాగర్‌కు, తిరుమలగిరి సాగర్‌లో ఉన్న వి.సురేష్‌ను నల్లగొండ టూటౌన్ ఎస్ఐ–2గా, వీఆర్ నల్లగొండలో ఉన్న మహేశ్వర్‌ను డీఎస్‌బీ నల్లగొండకు, గుడిపల్లి ఎస్ఐ ఎ.రంజిత్‌ను నల్లగొండ సీసీఎస్‌కు, పెద్దవూరలో ఉన్న రమేష్‌నాయక్‌ను నల్లగొండ ట్రాఫిక్‌కు, వీఆర్ నల్లగొండలో ఉన్న వి.రవిని కనగల్‌కు, డీసీఆర్‌బీ సూర్యాపేటలో ఉన్న ఐలయ్యకు శాలిగౌరారంలో పోస్టింగ్‌లు ఇచ్చారు.

# విద్యార్థుల మేధస్సుకు పదును

- 12న జిల్లా స్థాయి విజ్ఞాన ప్రతిభా పాటవ పోటీలు
- ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ



నల్లగొండ ఎమ్మార్సీలో మండల స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నల్లగొండ: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు విజ్ఞాన అంశాల పట్ల ఆసక్తి పెంచి వారి మేధస్సుకు పదును పెట్టేలా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు మండలం నుంచి రాష్ట్ర స్థాయి వరకు విజ్ఞాన ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయిలో పోటీలు నిర్వహించారు. అలాగే ఈనెల 12న ఉదయం 11 గంటల నుంచి నల్లగొండలోని డైట్ కళాశాలలో జిల్లా స్థాయి విజ్ఞాన ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**పోటీల ఉద్దేశమిదే..**
తెలంగాణ సాంకేతిక విద్యా మండలి, పర్యావరణ పరిరక్షణ, పరిశోధనా సంస్థలు సంయుక్తంగా సుస్థిర భవిష్యత్ కోసం వివిధ అంశాలపై ఉపన్యాసం, కవితలు, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహిస్తోంది. సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.

**విజేతల ఎంపిక ఇలా..**
మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 4 అంశాల్లో కలిపి నలుగురు చొప్పున జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. వీరు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఒక్కో అంశం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముగ్గురు చొప్పున 4 అంశాల్లో 12 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని విజేతలుగా ఎంపిక చేస్తారు. వారికి ఈనెల 28న జరిగే సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందజేయనున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**
విద్యార్థులు విజ్ఞాన పోటీలను సద్వినియోగం చేసుకుని వివిధ అంశాల్లో సత్తాచాటాలి. పాఠశాల స్థాయిలోనే విజ్ఞాన శాస్త్రాలు, వివిధ అంశాల పట్ల ఆసక్తి పెంచుకోవాలి.
– బొల్లారం భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

# వెల్లుల్లి రేటు.. యమ ఘాటు!

- చికెన్ ధర కంటే రెండింతలు పెరుగుదల
- గ్రేడును బట్టి కిలో రూ.350 నుంచి రూ.450 పలుకుతున్న ధర
- నవంబర్‌లో కిలో రూ.200 మాత్రమే..
- కొనలేని స్థితిలో సామాన్యులు



వెల్లుల్లిని గ్రేడింగ్ చేస్తున్న వ్యాపారులు

నల్లగొండ టౌన్: కిలో వెల్లుల్లి (ఎల్లిపాయల) రేటింతో తెసిస్తే నోరెళ్లబెట్టే పరిస్థితి దాపురించింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెల్లుల్లి ధర గ్రేడును బట్టి రూ.350 నుంచి రూ.450 వరకు అమ్ముతున్నారు. అక్టోబర్, నవంబర్ మాసాల్లో కిలో వెల్లుల్లి ధర రూ.200 లోపు మాత్రమే ఉండగా ప్రస్తుతం చికెన్ ధర కంటే రెట్టింపు కావడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. నిత్యావసర సరుకులు కొనడానికి వెళ్లిన సామాన్యులు వెల్లుల్లి ధర విని వామ్మో అంటున్నారు. ఇదివరకు నెలకు కిలోల కొద్దీకొన్న గృహిణులు నేడు పావు కిలోతో సరిపుచ్చుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి.

**తగ్గిన వాడకం**
ప్రతి వంటకాల్లో అల్లం, వెల్లుల్లిని వాడితేనే రుచికరంగా ఉంటుంది. దాంతో ప్రతిఒక్కరూ వెల్లుల్లిని వాడడం సహజం. ప్రస్తుతం వెల్లుల్లి ధర అమాంతం పెరిగిపోవడంతో వంటకాల్లో వాటి పరిమాణాన్ని తగ్గించి వాడుతున్నారు గృహిణులు. గతంలో పట్టణాలు, గ్రామాల్లో అల్లం, వెల్లుల్లిని ఆటోలు, ఇతర వాహనాల్లో తీసుకొచ్చి రెండు కలిపి కిలో ధర రూ.100 నుంచి రూ.150 వరకు అమ్మేవారు. ప్రస్తుతం వాటి ధర ఆకాశాన్నంటడంతో చిరువ్యాపారులు అమ్మడమే మానేసినట్టు తెలుస్తోంది.

**స్థానికంగా పంట దిగుబడి లేకపోవడంతోనే..**
మన రాష్ట్రంలో వెల్లుల్లి పంట తక్కువ విస్తీర్ణంలో సాగవుతూ ఉంది. అయితే పోయిన వానాకాలంలో వచ్చిన అకాల వర్షాలతో పంట దెబ్బతినడంతో దిగుబడి లేకుండా పోయింది. దీంతో కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వెల్లుల్లిని దిగుమతి చేసుకుంటున్న పరిస్థితి. అక్కడ కూడా వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజులలో వెల్లుల్లి మరింత ప్రియం కానున్నట్లు వ్యాపారులు చెపుతున్నారు.

**నిత్యావసరాల ధరలు తగ్గించాలి**



మార్కెట్‌లో ప్రస్తుతం ఏది కోనేటట్లు లేదు. కూరగాయలు, బియ్యం ధరలే పెరిగాయంటే ప్రస్తుతం అల్లంతో పాటు ఎల్లిపాయల ధర కూడా పెరిగింది. సామాన్యులు ఎల్లిపాయలు కొనలేని పరిస్థితి. మాంసం, చికెన్ కూరలు రుచిగా ఉండాలంటే ఎల్లిపాయలు, అల్లం వాడాల్సిందే. ప్రభుత్వం స్పందించి నిత్యావరాల ధరలు తగ్గిచాలి.
– పద్మ, చర్లపల్లి, నల్లగొండ మున్సిపాలిటీ

**రోజూ కూరల్లో వాడాల్సిందే..**



ఎల్లిపాయలను ప్రతిరోజూ కూరల్లో వాడాల్సిందే. దాన్ని వేస్తేనే కూరలు రుచిగా ఉంటాయి. ప్రస్తుతం వెల్లుల్లి ధర అమాంతం పెరిగిపోవడంతో వాటిని కొనలేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే పెరిగిన ధరలను తగ్గించాలి. నిరుపేదలకు అన్ని రకాల నిత్యావసరాల ధరలను అందుబాటులో ఉంచాలి.
– యాదమ్మ, బుద్ధారం, నల్లగొండ మండలం

## క్లుప్తంగా

### ఉరేసుకుని ఆత్మహత్య

**వలిగొండ :** ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని ఆరూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోదర బోయిన గౌతమ్ (22) చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో ఆరూర్‌లోని అమ్మమ్మ పిట్టల యాదమ్మ ఇంటి వద్ద ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గౌతమ్ కొంతకాలంగా మద్యానికి బానిసై అమ్మమ్మ బయటకు వెళ్లగానే చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెందాడు. అమ్మమ్మ వచ్చి చూసే సరికి వేలాడుతూ కనిపించగా లబోదిబో మంటూ చుట్టుపక్కల వారిని పిలిచింది. వారు వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు.

### టీచర్ల సమస్యలపై పోరులో పీఆర్‌టీయూ పాత్ర కీలకం



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న పీఆర్‌టీయూ నాయకులు

**నల్లగొండ:** ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటంలో పీఆర్‌టీయూ టీఎస్ కీలక పాత్ర పోషిస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీవీఎస్.ఫణికుమార్, కాశం నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం పీఆర్‌టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ భవనంలో సంఘం జెండాను ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షులు సామల యాదగిరి, బీరవోలు ధర్మారెడ్డి, ఎంఏ అజీజ్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971లో పీఆర్‌టీయూ ఏర్పడినప్పటి నుంచి ఉపాధ్యాయుల సమస్యలపై ఎనలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. మహిళా ఉపాధ్యాయులకు అదనపు సెలవులు, చైల్డ్ కేర్ లీవ్‌లు, పంచాయతీ రాజ్ టీచర్లకు ప్రమోషన్లు ఇప్పించిన ఘనత సంఘానిదేనన్నారు. సంఘానికి విలువైన సేవలు అందించిన పలువురు ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఓరుగంటి శ్రీనివాసులు, నాయకుడు ధీరావత్ నర్సింహ నాయక్, తరాల జగదీష్, మేకల జానారెడ్డి, తరాల పరమేశ్ యాదవ్, చామల చంద్రశేఖర్, బండా రమేష్‌రెడ్డి, అంబటి అంజయ్య, మిట్ట శ్రీనివాస్‌రెడ్డి, యుగంధరాచారి, వెంకటేశం, హిమజ, జగిని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# విష ప్రయోగంతో హత్య

- భూ తగాదాల నేపథ్యంలోనే ఘాతుకం
- సారాలో విషం కలిపిన ఇద్దరు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ సురేష్

**డిండి:** డిండి మండలం వీరబోయనపల్లి గ్రామానికి చెందిన నంది సహదేవుడు(42)ను భూ తగాదాల నేపథ్యంలోనే సారాలో విషం కలిపి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. డిండి రూరల్ సీఐ ఎస్.సురేష్ దేవరకొండలోని తన శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. డిండి మండల పరిధిలోని వీరబోయనపల్లి గ్రామానికి చెందిన నంది సహదేవుడు(42), భార్య అంజనమ్మ, కొడుకు రాముతో కలిసి స్థానికంగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన నంది ఈశ్వరయ్యతో కొన్ని సంవత్సరాల నుంచి సహదేవుడు కుటుంబానికి భూతగాదాల పంచాయితీ కొనసాగుతోంది. దీంతో సహదేవుడుని అంతమొందించాలని భావించిన ఈశ్వరయ్య ఇరువురికి దగ్గరి బంధువైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం వేలుమలపల్లి గ్రామానికి చెందిన చెనమోని జంగయ్యతో కలిసి పన్నాగం పన్నాడు. సహదేవుడిని చంపితే నీకు కొంత మేర నగదు డబ్బు ఇస్తానని ఈశ్వరయ్య జంగయ్యతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇందులో భాగంగా జంగయ్య మూడు నెలల నుంచి అప్పుడప్పుడు వీరబోయనపల్లిలో సహదేవుడితో కలిసి సారా తాగి వెళ్లేవాడు. ఈనెల



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్

4వ తేదీన జంగయ్య తన వెంట తెచ్చిన సారాలో సహదేవుడి కలిసి వ్యవసాయ భూమిలో సగం వరకు తాగి మిగిలిన సారాను ఇంటికి తీసుకెళ్లాడు. ఇదే అదునుగా చేసుకున్న ఈశ్వరయ్య విషం కలిసిన సారాతో నింపిన ప్లాస్టిక్ బాటిల్‌ను సహదేవుడి వ్యవసాయం పొలంలో ఉంచిన విషయాన్ని జంగయ్యకు ఫోన్‌లో తెలియజేశాడు. దీంతో జంగయ్య 5న సాయంత్రం ఫోన్ చేసి నీ వ్యవసాయ భూమిలోని ఓ చెట్టు వద్ద బాటిల్లో సారా ఉంచానని సహదేవుడికి తాగమని ఫోన్లో చెప్పాడు. రాత్రి సమయంలో ఆ సారా బాటిల్‌ను ఇంటికి తీసుకవచ్చిన సహదేవుడు తాగగా విషం కలిపినట్లు అనుమానం రావడంతో కుమారుడు రాము దానిని కొద్దిగా నోట్లో పోసుకొని పరిక్షించాడు. నిమిషాల వ్యవధిలోనే తండ్రి, కొడుకులిద్దరూ అస్వస్థకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు ఇద్దరిని చికిత్స నిమిత్తం తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో సహదేవుడు మృతి చెందగా రాము హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రితలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు మృతుడి భార్య అంజనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమనాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**నిందితులపై హత్య కేసు**

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు ఈనెల 7న నిందితులైన నంది ఈశ్వరయ్య, చెనమోని జంగయ్యను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి విచారణ చేపట్టారు. భూతగాదాల కారణంగానే సహదేవుడిని హత్య చేసేందుకే సారాలో విషం కలిపామని ఈశ్వరయ్య, జంగయ్య ఒప్పుకున్నారు. దీంతో ఇద్దరిపై 302 సెక్షన్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఐ.సైదులు, సిబ్బంది తదితరులున్నారు.

**హతుడి భార్య అంజనమ్మ పేరిట నాలుగు ఎకరాల భూమి పట్టా**

భూతగాదాల కారణంగా సహదేవుడి హత్యకు కారణమైన నంది ఈశ్వరయ్యకు చెందిన 2 ఎకరాలతోపాటు భాగాల పంపిణీలో ఈశ్వరయ్య నుంచి సహదేవుడికి రావాల్సిన మరో 2 ఎకరాలు మొత్తం 4 ఎకరాల వ్యవసాయ భూమిని గ్రామ పెద్దల సమక్షంలో మృతుడి భార్య అంజనమ్మ పేర మీదకు రిజిస్ట్రేషన్ చేశారు. అదే విధంగా మరో నిందితుడైన చెనమోని జంగయ్య ఆస్పత్రిలో ఉన్న రాము వైద్య ఖర్చుల పిమిత్తం మొత్తం రూ. 8 లక్షలు ఒప్పుకోగా అందులోంచి లక్ష రుపాయాలు చెల్లించినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు.

# కొనసాగుతున్న విచారణ

- హాస్టల్ వార్డెన్, సిబ్బందితో మాట్లాడిన విచారణాధికారి
- విద్యార్థినులంతా ఇళ్లకు వెళ్లడంతో విచారణలో జాప్యం
- ఇద్దరు విద్యార్థినుల మృతి ఘటనపై పెరుగుతున్న అనుమానాలు



విచారణ నిర్వహిస్తున్న విచారణాధికారి నాగలక్ష్మి

**సాక్షి, యాదాద్రి :** భువనగిరిలోని ఎస్సీ వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినుల అనుమానాస్పద మృతిపై విచారణ కొనసాగుతోంది. ఈ నెల 3న జరిగిన ఇద్దరు పదవ తరగతి విద్యార్థినులు చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వంతో పాటు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా విచారణాధికారులను నియమించారు. యాదాద్రి జిల్లా కలెక్టర్ నియమించిన విచారణాధికారి డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం బాలిక వసతి గృహాన్ని సదర్శించారు. అక్కడ విద్యార్థినులు ఎవరూ లేకపోవడంతో సిబ్బందిని విచారించారు. విద్యార్థులు మృతి చెందిన గది, హాస్టల్ పరిసరాలు పరిశీలించారు. అక్కడి సిబ్బంది పనితీరు, వ్యవహార శైలిపై విచారణ జరిపారు. అనంతరం కలెక్టరేట్‌లో హాస్టల్ వార్డెన్‌ను విచారించారు. విచారణ పూర్తికావడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, విచారణ సమయంలో సిబ్బంది ఒకే తీరుగా సమాధానాలు చెబుతున్న తీరుపై అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**విచారణలో వెలుగు చూస్తున్న అంశాలు ఇవీ..**

ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణకు వచ్చిన అధికారులు పలు అనుమానాస్పద అంశాలను గుర్తించినట్టు తెలిసింది. విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారా... లేక తల్లిదండ్రులు, పలు సంఘాలు ఆరోపిస్తున్నట్లు ఎవరైనా హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా అన్న విషయాలపై దృష్టి సారించారు. ఆ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారని మొదట చెప్పారు. తర్వాత మాట మార్చిన సిబ్బంది.. ఫ్యాన్ కోసం ఏర్పాటు చేసిన ఇనుప కొక్కేలకు ఉరివేసుకున్నారని చెప్పారు. బెడ్ మీద నిలబడి ఉరివేసుకుంటే ఎత్తుగా ఉన్న విద్యార్థులకు ఉరిపడే అవకాశం లేదని విచారణాధికారులు గుర్తించారు. చనిపోయిన విద్యార్థులు ఆ రోజు సాయంత్రం భోజనానికి రాలేదని సిబ్బంది చెప్పారు. కానీ, విద్యార్థుల ప్లేట్లలో భోజనం ఉంది. విచారణ జరుగుతున్న సమయంలో మిగతా విద్యార్థులను సంబంధిత అధికారులే ఇంటికి పంపించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉరివేసుకుని మృతి చెందే సమయంలో శరీరంలో కన్పించే మార్పులు ఎక్కడా లేవని తెలుస్తోంది. పోస్టుమార్టం రిపోర్టులో విద్యార్థినుల శరీరంపై ఎలాంటి గాయాలూ లేవని పోలీసులు చెబుతున్నారు. కాగా, వసతి గృహం కొనసాగుతున్న భవనం యజమాని, ఆటో డ్రైవర్‌పై సోషల్ మీడియాలో పలు అనుమానాస్పద పోస్టులు వస్తున్నాయి. ఈ కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. విద్యార్థులు మృతిచెందిన రోజు గదిలోకి పోలీసులు, క్లూస్ టీం రాకముందే ఇతరులు వెళ్లడంతో అక్కడ లభించాల్సిన పలు ఆధారాలు చెరిగిపోయి ఉంటాయని భావిస్తున్నారు. ఆటో డ్రైవర్, వంటమనిషి, నైట్ వాచ్‌ఉమన్‌లతోపాటు మరికొందరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉందని ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో హాస్టల్ వార్డెన్ శైలజ, ఆటో డ్రైవర్ ఆంజనేయులు, వంట మనుషులు సుజాత, సులోచన, పీఈటీ ప్రతిభ, ట్యూటర్ భువనేశ్వరీల పేర్లను పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేశారు. వీరిని విచారిస్తున్నామని చెబుతున్నారు.

**ఇళ్లకు వెళ్లిపోయిన విద్యార్థినులు**

ప్రైవేట్ ఐటీఐ భవనంలో నిర్వహిస్తున్న ఎస్సీ బాలిక వసతి గృహం, బాలికల బీసీ కాలేజీ వసతి గృహంలో విద్యార్థినులంతా ఈ ఘటన తర్వాత ఇళ్లకు వెళ్లిపోయారు. వారం రోజులు కావస్తున్నా వారు ఈ వసతి గృహాలకు రావడానికి ఇష్టపడడం లేదు. విచారణకు వెళ్లిన అధికారులకు విద్యార్థులను విచారించలేకపోతున్నారు. ఎస్సీ బాలికల వసతి గృహంలో రికార్డు ప్రకారం 112 మంది విద్యార్థులు ఉన్నా అందులో ఉన్నది 56 మందే అని తేలింది. ఇందులో పదవతరగతి విద్యార్థినులు 8 మంది ఉన్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారింది.

## దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ధనుంజయ్

**కొండమల్లేపల్లి :** కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండులో ఓ మహిళ వద్ద ట్యాబ్‌ను దొంగలించబోయి పట్టుబడిన వ్యక్తిని విచారించగా పది మంది దొంగల ముఠా గుట్టు రట్టయ్యింది. కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా డ్రోన్ ప్రాంతానికి చెందిన కొంత మంది ముఠాగా ఏర్పడి హైదరాబాద్ సమీపంలోని బొంగలూరు వద్ద అద్దెకు గదిని తీసుకొని ఉంటున్నారు. వీరంతా వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతుండే వారు. ఈ క్రమంలోనే ఈనెల 2న కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ వద్ద నుంచి ట్యాబ్‌ను తస్కరించేందుకు యత్నించి పట్టుబడ్డాడు. విషయం తెలుసుకున్న కొండమల్లేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా దొంగల ముఠా గుట్టు రట్టయ్యింది. పట్టుబడిన పది మందిలో నలుగురు బాల నేరస్తులు ఉన్నారు. వీరంతా రద్దీ ప్రదేశాల్లో, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతుండే వారు.వీరి వద్ద నుంచి కారు, పది సెల్ ఫోన్లు, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన వారిని కోర్టుకు రిమాండ్ చేసినట్లు తెలిపారు. కేసును చేధించిన కొండమల్లేపల్లి ఎస్‌ఐ వీరబాబు, సిబ్బందిని సీఐ అభినందించారు.

## చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

- నిందితులపై 40కి పైగా కేసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరసింహారావు

**మిర్యాలగూడ అర్బన్:** చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను మిర్యాలగూడ టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నరసింహారావు నిందితుల వివరాలను శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరించారు. నల్ల గొండ జిల్లా కనగల్ మండలం యడవెల్లి గ్రామానికి చెందిన రుద్రాక్ష శ్రీను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన ఆలమూరి సంజీవరెడ్డిలు ఇద్దరు నేరస్తులుగా చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవిస్తూ జైల్లో పరిచయమయ్యారు. ఇద్దరు కలిసి ఈ నెల 6వ తేదీన పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఓ ఇంటిలోకి ప్రవేశించి బీరువాను పగులకొట్టి అందులోకి నల్లపూసల హారంతో పాటు రెండు చెవి దిద్దులు, నగదును చోరీ చేశారు. అంతే కాకుండా అదే రోజు మరో వీధిలోకి ప్రవేశించి ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉంచిన బజాజ్ ప్లాటినం బైక్‌ను తీసుకెళ్లారు.

**దొంగలను పట్టించిన జీపీఎస్..**

దొంగతనం చేసి తీసుకెళ్లిన బైక్‌కు జీపీఎస్ లొకేషన్ ఉండటంతో దాని ద్వారా విచారణ చేపట్టిన పోలీసులు వారి ఆచూకీని కనుగొన్నారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉన్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా రుద్రాక్ష శ్రీను, సంజీవరెడ్డిలపై గతంలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో 40కి పైగా కేసులు ఉన్నాయి. కొన్ని కేసులలో శిక్ష కూడా అనుభవించగా ఒక కేసులో శిక్ష అనుభవించిన ఇద్దరు నిందితులు కూడా ఈ నెల 1వ తేదీనే చర్లపల్లి జైలునుంచి విడుదలయ్యాడు. కాగా 1న విడుదలై 6న చోరీకి పాల్పడి తిరిగి 9న జైలుపాలయ్యాడు. ఈ కేసును ఛేదించిన ఎస్‌ఐ లు ఎస్.క్రిష్టయ్య, బి.రాంబాబు, హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు రవి, అనిల్, నరేష్, రామకృష్ణలను సీఐ అభినందించారు.

## మంత్రుల పర్యటనలో జేబు దొంగల చేతివాటం

**హుజూర్‌నగర్ :** ఇటీవల పట్టణంలో మంత్రుల పర్యటనలో జేబు దొంగల చేతివాటం ప్రదర్శించిన విషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగు చూసింది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఆస్పత్రులపై సమీక్ష నిర్వహించేందుకు ఈనెల 7న రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సంహ, తుమ్మల నాగేశ్వరరావులు హుజూర్‌నగర్‌కు హెలికాప్టర్‌లో వచ్చి పట్టణంలోని ఏరియా ఆస్పత్రికు చేరుకున్న సంగతి తెలిసిందే. అయితే మంత్రులను ప్రసన్నం చేసుకునేందుకు హెలిపాడ్ వద్దకు వచ్చిన పలువురు నాయకులు, కార్యకర్తల జేబులను జేబు దొంగలు ఖాళీ చేశారు. హుజూర్‌నగర్, నేరేడుచర్ల మండలాలకు చెందిన ముగ్గురు ముఖ్య నేతలతో పాటు, పలువురు నేతల జేబుల్లో ఉన్న మొత్తం దాదాపు రూ. 2లక్షకుపైగా తస్కరించినట్లు తమ సన్నిహితుల వద్ద వారు వాపోతున్నారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసినట్లు బాధితులు తెలిపారు.

## సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

**భూదాన్‌పోచంపల్లి :** సస్యరక్షణ చర్యలతో వరిలో తెగుళ్లను నివారించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) అనురాధ రైతులకు సూచించారు. శుక్రవారం రాజేంద్రనగర్ వరిపరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌బాబు, భువనగిరి ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త అనిల్‌కుమార్‌తో కలిసి భూదాన్‌పోచంపల్లి, అంతమ్మగూడెం, దోతిగూడెం, జిబ్లక్‌పల్లి, కనుముకుల, జలాల్‌పురంలో వరి చేలను పరిశీలించారు. పైరుకు మొగిపురుగు ఆశిస్తున్నట్లు గుర్తించి రైతులకు సూచనలు చేశారు. నాచు ఎక్కువగా ఉన్నట్లయితే యూరియాతో పాటు కార్బండజిమ్, మాంకోజెబ్ మిశ్రమాన్ని చల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎజాజ్ అలీఖాన్, ఏఈఓలు నరేశ్, సోని, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## ఈవీఎంలు, వీవీ ప్యాట్లు సిద్ధం





పార్లమెంట్ ఎన్నికలకు వినియోగించేందుకు గాను ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లు (ఈవీఎంలు), వీవీ ప్యాట్లు సిద్ధమవుతున్నాయి. గత ఎన్నికల్లో వినియోగించి నల్లగొండ కలెక్టరేట్ ఆవరణలోని స్ట్రాంగ్‌రూమ్‌లో ఉంచిన యంత్రాలపై అంటించిన స్టిక్కర్లు, ట్యాగులను శుక్రవారం తొలగించారు. వాటిని మరలా బాక్సుల్లో పెట్టి స్ట్రాంగ్ రూమ్‌లోనే భద్రపరిచారు.



## హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్

**వలిగొండ :** ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు స్వరూపంగ ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని లోతుకుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే వార్షిక బడ్జెట్ లో ఐదు శాతం వికలాంగులకు కేటాయించాలని కోరారు. సమావేశంలో పార్వతి, పాక పెంటయ్య, వీరాచారి, వల్లపు లింగయ్య పాల్గొన్నారు.

## బాలికా రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

- జిల్లా మొదటి అదనపు జడ్జి మారుతిదేవి



విద్యార్థినులతో మాట్లాడుతున్న జడ్జి మారుతిదేవి

**భువనగిరి :** పాఠశాలల్లో బాలికలకు విద్యనందించడమే కాకుండా వారి రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి మారుతిదేవి ఉపాధ్యాయులకు సూచించారు. బాలల పరిరక్షణ, బాలల హక్కుల చైతన్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భువనగిరిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, భోజన నాణ్యతపై తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, పాఠశాల హెచ్‌ఎం వహీదా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# బొప్పాయి సాగు.. సిరుల పంట

- సాగుకు అన్ని కాలాలు అనుకూలం
- సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడి
- ఉద్యానవన శాఖ అధికారి రవినాయక్



బి. రవినాయక్

**పెద్దవూర:** వేసవిని సైతం తట్టుకుని మంచి దిగుబడి ఇచ్చే పంటల్లో బొప్పయి తోటలు ప్రధానంగా నిలుస్తాయి. బొప్పయి సాగుతో మంచి ఆదాయం ఆర్జించవచ్చునని ఉద్యానవన శాఖ అధికారి బి.రవినాయక్ పేర్కొన్నారు. బొప్పాయి సాగుపై ఆయన తెలిపిన వివరాలు, సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

**నేలలు..**

నీటి నిల్వ సారవంతమైన తేలికపాటి నల్లరేగడి నేలలు, ఎర్రగరప నేలలు అనుకూలంగా ఉంటాయి. నీరు నిలచే నేలలు, చౌడు, ఆమ్లనేలలు పనికిరావు.

బొప్పాయిల రకాలు ఐ ఏక లింగాశ్రయ, ద్విలింగాశ్రయ జాతి. వీటిలో ఆడ, మగ పుష్పాలు వేర్వేరుగా పూసే మొక్కలు ఉంటాయి. వీటిలో వాషింగ్‌టన్, సోలో, పూసా డెలిషియస్, పూసా జెయింట్, రైజ్ సోలో, సూర్య, కో-రకంలో 1,2,3,4,5,6,7 అనే రకాలు ఉన్నాయి.

**విత్తనాల ప్రవర్ధనం(అభివృద్ధి) :** బొప్పాయి పండు నుంచి తీసి ఆరబెట్టిన విత్తనాలను 45 రోజుల్లోగా విత్తుకోవాలి. హైబ్రీడ్ రకాల నుంచి తీసిన విత్తనాలను ప్రవర్ధనానికి వినియోగించరాదు.

**విత్తుకునే విధానం:** ఎకరానికి 200 గ్రాముల వరకు విత్తనాలు సరిపోతాయి. విత్తనాలను తగినంత 150 గేజ్ మందం కలిగిన పాలథీన్ సంచుల్లో పశువుల ఎరువు, ఇసుక కలిపిన మట్టితో కలిపి నాటాలి.



సాగవుతున్న బొప్పాయి

**నాటుకునే విధానం:** భూమిని తగినంత తడి ఉన్నప్పుడు 30-40 సెంటీమీటర్ల లోతుగా మెత్తగా దున్నుకోవాలి. మొక్కల మధ్య ఎటుచూసినా 1.8 మీటర్ల దూరం ఉండేలా తగినంత గుంతలు తీసి సిద్ధం చేసుకోవాలి. ప్రతీ గుంతలో 5 కిలోల పశువుల ఎరువు, కిలో వేపపిండి, 20 గ్రాముల అజోస్పైరిల్లం, 20 గ్రాముల ఫాస్ఫో బాక్టీరియా వేసి బాగా కలిపి గుంతలను నింపాలి. అనంతరం 45 నుంచి 60 రోజులు కలిగిన బొప్పాయి మొక్కలను సాయంత్రం పూట మాత్రమే గుంతల్లో నాటుకోవాలి.

**ఎరువులు వేసుకునే విధానం:** ఒక్కో బొప్పాయి మొక్కకు ఒక ఏడాదికి 10 కిలోల పశువుల ఎరువు, 12 కిలోల వేప పిండి, లేదా ఆముదం పిండి, అరకిలో యూరియా, 1.6 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, 850 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను రెండు నెలలకోసారి ఏడాదంతా ఆరు సార్లు వేసుకోవాలి. డ్రిప్ ద్వారా ఎరువులను అందించాలంటే 13.5 గ్రాముల యూరియా, 10.5 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను వారం వ్యవధిలో 48 వారాల పాటు అందించాలి. తేలికపాటి నేలల్లో జింక్, ధాతు లోపాలు ఎక్కువ కనిపిస్తుంటాయి. వీటి నివారణకు లీటర్ నీటికి ఒక గ్రాము బోరాక్స్, 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలి.

పాడి పంట

**నీటిని అందించే విధానం**

మొక్కల మొదళ్ల వద్ద నీరు తగలకుండా, నీరు నిల్వ ఉండకుండా పిల్ల పాదులు తయారు చేసి నీటిని పారించాలి. డ్రిప్ ద్వారా అయితే చిన్న మొక్కలకు రెండు రోజులకు ఒకసారి ఎనిమిది లీటర్ల నీటిని, పెద్ద మొక్కలకు వేసవిలో ప్రతిరోజు 20 నుంచి 25 లీటర్ల నీటిని అందించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. వర్షాకాలంలో అయితే అవసరాన్ని బట్టి నీటి తడులను అందించాలి.

**సస్యరక్షణ చర్యలు**

**కాండం మొదలు కుళ్లు :** వేర్లు, మొదలు మెత్తగా మారి కుళ్లిపోతాయి. కాయలకు కలిగిన బొప్పాయి చెట్లను ఆశించి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. వీని నివారణకు మొక్కల మొదళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలి. లీటర్ నీటికి 2 గ్రాములు అలియేట్ కలిపి మొదలు తడపాలి. వారం వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు తడపాలి.

**బూడిద తెగులు :** ఆకులపై, లేత చిగుళ్లపై కాండంపైన తెల్లటి బూడిదలాంటి శిలీంద్రం ఏర్పడుతుంది. దీని నివారణకు లీటర్ నీటికి 2 మి.లీ. నీటిని కలిపి పిచికారీ చేయాలి.

**ఆకుమచ్చ తెగులు :** ఆకులపై గోదుమ వర్ణపు మచ్చలు ఏర్పడి ఆకులు పసుపు రంగుకు మారి ఎండిపోతాయి. వీని నివారణకు క్లోరోథాలోనిన్ 2 గ్రాములు కలిపి పక్షం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

**కాండం కుళ్లు :** కాండం మొదలు కుళ్లిపోయి జిగురు లాంటి ద్రవం కారుతుంది. దీంతో చెట్లు వాలిపోతాయి. దీని నివారణకు కిలో ట్రైకోడెర్మా విరిడి శిలీంద్రంతో పాటు 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి, ఒక కిలో బెల్లం నీటిని 10 రోజుల పాటు మండె కట్టి చెట్ల పాదుల్లో వేసుకోవాలి.

**ఆకుముడత :** వైరస్ కారణంగా ఆకులన్నీ ముడుచుకుపోతాయి. కాయల ఆకారం వంకరటింకరగా మారుతాయి. దీంతో సాగుబడి తగ్గిపోతుంది. అంతర్వాహిక కీటక నాశనులను ఉపయోగించి వైరస్ ద్వారా సంభవించు తెగుళ్లను అరికట్టవచ్చు.

**పండు ఈగ :** పక్వానికి వచ్చిన కాయలను ఆశించి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. కాయలోని గుజ్జును తినివేయడం వలన కాయలు మెత్తబడి కుళ్లిపోతాయి. దీని నివారణకు బొప్పాయి తోటలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. చెట్లకింద పడిపోయిన పండ్లను ఏరి నాశనం చేయాలి. లీటర్ నీటికి ఒక మిల్లీలీటర్ మిథైల్‌యూజినాల్, 2 గ్రాముల కార్బోఫ్యూరాన్‌లను కలిపి పొలంలో అక్కడక్కడా వేసుకోవాలి.

**కోత విధానం :** బొప్పాయి మొక్కలను నాటిన 9వ నెల నుంచి రెండున్నరేళ్లలో కాపుకు వస్తుంది. ఎకరానికి 25 నుంచి 30 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. బాగున్న కాయలను చెట్లపై మాగనీయరాదు. బారీ పరిమాణం గల కాయలను కోసి న్యూస్ పేపర్లలో చుట్టి మార్కెట్‌కు తరలించాలి.